క్లుప్తంగా

నేడు ధర్మ ప్రచార మండలి ప్రమాణ స్వీకారం

కడప కల్చరల్ : హిందువుల్లో ధార్మిక విలువలు పెంచేందుకు, సనాతన ధర్మాన్ని వ్యాప్తి చేసేందుకు జిల్లా స్థాయిలో ధర్మ ప్రచార మండలి కమిటీలను ఏర్పాటు చేశారు. తిరుమల–తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ల ఆధ్వర్యంలో ధర్మ ప్రచార మండలి పేరిట కమిటీలను ఏర్పాటు చేశారు. వివిధ రంగాల్లో ప్రముఖులు, ఆధ్యాత్మిక వేత్తలైన వారిని ఈ కమిటీలో పలు హోదాల్లో నియమించారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శుక్రవారం ఉదయం 8 గంటలకు రిమ్స్ వద్దగల ఇందిరానగర్‌లోని శ్రీ భద్రాద్రి రామాలయంలో నిర్వహించనున్నారు. అనంతరం ఆత్మీయ సమ్మేళనం కూడా నిర్వహిస్తారు.

వాన వెలసింది.. వర్షపునీరు నిలిచింది



వరదకాలనీలో బురదమయమైన రోడ్డు

కడప కార్పొరేషన్ : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో రెండు రోజులుగా వర్షాలు కురిశాయి. కడపలో బుధవారం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. గురువారం కాస్త తెరపి ఇచ్చినా అప్పుడప్పుడు జల్లులు కురిశాయి. వినాయకనగర్ సర్కిల్, ఇర్కాన్ సర్కిల్, సంజన్న సర్కిల్, గురుకుల్ విద్యాపీఠ్, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో వర్షపు నీరు అలాగే నిలిచిపోయింది. రాకపోకలు సాగించడానికి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. శివారు ప్రాంతాల్లోని మట్టి రోడ్లు గుంతలు పడి బురదమయం అయ్యాయి.

నేడు వీఎన్‌పల్లెకు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్ రెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించనున్నట్లు రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టర్ లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి తెలిపారు. ఎస్.పాలగిరి పంచాయతీ పరిధిలోని నేలతిమ్మాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, నీటి శుద్ధి కేంద్రాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

తల్లీ, శిశు సంరక్షణపై అవగాహన



బాలింతకు సూచనలిస్తున్న ఏఎన్‌ఎంలు

చెన్నూరు : చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం కేర్ క్యాంపెయిన్, నూరా హెల్త్ ఆర్గనైజేషన్ ద్వారా ఏఎన్‌ఎంలకు ట్రినింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివశంకర్, డాక్టర్ దినకర్ రెడ్డి మాట్లాడుతూ నూరా హెల్త్ ఆర్గనైజేషన్ ద్వారా ఏఎన్‌ఎంలకు తల్లి శిశు సంరక్షణ కోసం పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవలసిన పద్ధతుల పై శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాలలోని గర్భిణులకు పలు సూచనలు చేశారు. తల్లిపాల విశిష్టత, తల్లిపాల ప్రాముఖ్యత, టీకాల గురించి వారికి వివరించారు. తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరీష్, డాక్టర్ శిరీష , డాక్టర్ శివ శంకర్, డాక్టర్ సాగర్ కుమారి, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాజోలి ఆనకట్టకు వర్షం నీరు



రాజోలి ఆనకట్ట నుంచి కుందూనదిలోకి పోతున్న నీరు

రాజుపాళెం : ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని పలు గ్రామాల్లో కురుస్తున్న వర్షం నీరంతా రాజుపాళెం మండలంలోని రాజోలి ఆనకట్టకు భారీగా వచ్చి చేరుతోంది. గతంలో ఆనకట్టలో 350 క్యూసెక్కులు మాత్రమే ఉండగా గురువారం ఆనకట్ట నుంచి కుందూనదిలోకి 5472 క్యూసెక్కులు నీరు పోతోందని కేసీ కెనాల్ అధికారులు తెలిపారు. అయితే ఇదంతా వర్షం నీరేనని, రైతులంతా గమనించుకోవాలని ఆశాఖ అధికారులు సూచించారు. ప్రవాహ ప్రాంతాల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

పీర్ల పండుగ నేపథ్యంలో ప్రత్యేక కథనం



కొలువుదీరిన పీర్లు

కడప కల్చరల్ : వైఎస్సార్ జిల్లాను మత సామరస్యానికి ప్రతీకగా పేర్కొంటారు. మతసహనంలో, కలిసి మెలిసి పండుగలు నిర్వహించుకోవడంలో జిల్లాకు జాతీయ స్థాయిలో అవార్డు లభించింది. ఇందులో మొహర్రం పండుగ మత సామరస్యానికి మారు పేరుగా నిలుస్తోంది. దీన్ని జిల్లాలో ఎక్కువగా గ్రామ ప్రాంతాలలో ఘనంగా నిర్వహిస్తారు. ఆ గ్రామాల్లో ఉండేది కొన్ని ముస్లిం కుటుంబాలే అయినా వారికి ఊరంతా హిందువులు కూడా తోడై అందరూ కలిసి పండుగను క్రమబద్ధంగా నిర్వహించడం పలు తరాలుగా ఆనవాయితీ. గ్రామ ప్రాంతాల్లో దీన్ని పీర్ల పండుగగా వ్యవహరిస్తారు. నిజానికి ఇది విషాద భరితమైన రోజు అయినా స్ఫూర్తి కోసం ఉత్సవంలాగా నిర్వహిస్తారు గనుక వ్యవహారంలో దీన్ని పండుగగానే వ్యవహరిస్తున్నారు.

■ కడప నగరంలో రెండు, మూడుచోట్ల మొహర్రంను వైభవంగా నిర్వహిస్తారు. మొహర్రం నాడు పెద్దదర్గాలో హజరత్ సయ్యద్‌షా పీరుల్లామాలిక్ సాహెబ్ ఉరుసుగా నిర్వహిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అనేక ధార్మిక కార్యక్రమాలు, ఫాతెహా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా హజరత్ పీరుల్లామాలిక్ మజార్ ఉన్న ప్రాంతాన్ని పూర్తిగా ప్రత్యేకంగా తెప్పించే రంగురంగుల అరుదైన పూలతో కళ్లు చెదిరేలా అలంకరిస్తారు.

మట్టిపెద్దపులి

కడప నగరం రెడ్‌క్రాస్ భవనం ఎదురుగా రోడ్డు కూడలిలో గల మట్టిపెద్దపులి విగ్రహానికి ఓ చరిత్ర ఉంది. దీనికి మొహర్రం వేడుకలకు చిన్న సంబంధం ఉంది గనుక ఈ సందర్భంగా దాని గురించి తెలుసుకుందాం. ప్రస్తుతం మట్టి పెద్దపులి విగ్రహం ఉన్న ప్రాంతంలో ఒకప్పుడు తాలింఖానా (వ్యాయామశాల) నిర్వహించేవారు. ఆ చుట్టుపక్కల గల ముస్లిం యువకులతోపాటు హిందు యువకులు కూడా వ్యాయామం చేస్తూ కుస్తీలు పట్టడంతోపాటు సంప్రదాయ యుద్ధ విద్యలు నేర్చుకునేవారు. వీధుల్లోగానీ, గ్రామానికి గానీ అరాచక శక్తుల వల్ల ఏదైనా ఆటంకాలు ఎదురైతే తాలింఖానా నిర్వాహకుల సూచనతో యువకులు వెళ్లి అవసరమైతే శారీరక బలం చూపి ఆ సమస్యను పరిష్కరించేవారు. పులులు లాంటి యువకులు, వారు వ్యాయామం చేసే తాలింఖానాలు ఉండే ప్రదేశం గనుక ఆ రోడ్ల కూడలిలో సాహస యువకులకు గుర్తుగా మట్టితో పెద్ద పులి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత అది రోడ్డు విస్తరణలో దెబ్బతింది. దాన్ని అక్కడి నుంచి తొలగించి మరమ్మతులు చేసి గౌస్‌నగర్ వద్ద డివైడర్‌లో దాన్ని ఏర్పాటు చేశారు. పాత దాని స్థానంలో కొత్తగా సిమెంటు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తాలింఖానాలోని యువకుల ఆధ్వర్యంలో అప్పట్లో పీర్ల పండుగను ఘనంగా నిర్వహించేవారు. మకాన్ల వద్ద నుంచి పీర్లను ఊరేగింపుగా తీసుకెళ్లి తిరిగి వాటిని శుభ్రం చేసి తిరిగి మకాన్లకు చేర్చేవారు. ఊరేగింపులో తాలింఖానాల యువకుల సాహస కృత్యాల ప్రదర్శనలే ప్రధాన ఆకర్షణగా ఉండేవి.

పీర్ల మకాన్లలో సందడి

నాగరాజుపేటలో బాదుల్లా సాహెబ్ పీర్ల మకాన్ ఉంది. పీర్ల పండుగ సందర్భంగా ఇక్కడ ఘనంగా ఉత్సవాన్ని నిర్వహిస్తారు. మకాన్ సమీపంలో ఎక్కువగా దుకాణాలు ఏర్పాటు చేస్తారు గనుక ఆ ప్రాంతం తిరునాలను తలపిస్తుంది. పలు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ ఉత్సవాలకు హాజరవుతారు.

■ కడప నగర శివార్లలోని అంగడివీధి సమీపంలో గల భాకరాపేట ప్రాంతంలో కూడా ప్రాచీనమైన పీర్ల మకాన్ ఉంది. ఇక్కడ కూడా మొహర్రం సందర్భంగా పీర్ల పండుగను భారీగా నిర్వహిస్తారు. ఎక్కడెక్కడి నుంచో భక్తులు వచ్చి మకాన్‌లోని పీర్లను దర్శించుకుని ఫాతెహా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అగ్ని గుండం ఏర్పాటు చేసి మొక్కులు గల భక్తులు నిప్పులపై నడిచే ఘట్టం ప్రధానాంశంగా చెప్పుకుంటారు. కడప పెద్దదర్గాలోకూడా పీర్ల మకాన్ ఉంది. ఇందులో కూడా ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి



నిరసన తెలియజేస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని పాత బస్టాండ్ లోగల జ్యోతిరావు పూలే సర్కిల్లో డీవైఎఫ్‌ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్రం మోసకారితనం బట్టబయలైందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో కేంద్ర హోం సహాయ మంత్రి ప్రకటనను డీవైఎఫ్‌ఐ ఖండిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు అన్వేష్, దస్తగిరి రెడ్డి, చంద్రారెడ్డి పాపిరెడ్డి రామకష్టారెడ్డి, డీవైఎఫ్‌ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ తీరు సరికాదు

కడప ఎడ్యుకేషన్ : కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం సాధ్యం కాదని పార్లమెంట్‌లో చెప్పడం సిగ్గుచేటని అఖిల భారత విద్యార్థి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబయ్య అన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కడప ఐటిఐ కళాశాలలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కమిటీ విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు ఐదు కోట్ల ఆంధ్రుల హక్కు అన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా కడప పరిశ్రమ ఏర్పాటు అని ఉన్నా కేంద్రంలోని బీజేపీ ఇంతవరకు ఏర్పాటు చేయలేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బి నాయకులు వంశీ, బ్రహ్మయ్య, ప్రేమసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ‘కథ చెబుతారా’ టీటీడీ కథల పోటీ

కడప కల్చరల్ : తిరుమల – తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లాశాఖ బాలలకు కథల పోటీని శుక్రవారం ఉదయం 8.00 గంటలకు నిర్వహిస్తోందని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ టి.గోపి బాబు తెలిపారు. స్థానిక ఇందిరానగర్‌లోని శ్రీ రామాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పది సంవత్సరాలలోపు విద్యార్థినీ విద్యార్థులు జూనియర్లుగా, 11–15 సంవత్సరాల లోపు విద్యార్థినీ విద్యార్థులు సీనియర్లుగా పోటీ నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగా ధర్మార్థ, కామ మోక్షాలను వివరించే భారత, భాగవత, రామాయణ గ్రంథాల నుంచి కథలతోపాటు పంచతంత్రం లేదా ఇతర నీతి కథలను విద్యార్థులు ఈ పోటీలో చెప్పాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు, విద్యార్థులు ఈ కార్యక్రమానికి సహకరించాలని నిర్వాహకులు కోరారు. రెండు విభాగాలుగా నిర్వహించనున్న ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని, రూ. 1000, 750, 500 నగదును విజేతలకు అందజేయనున్నారు. ఆసక్తిగలవారు 91107 79066 నెంబరులో సంప్రదించవచ్చు.

దంతాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



విద్యార్థినిలకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

కడప కోటిరెడ్డిసర్కిల్ : విద్యార్థులు దంతాల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి తరుచూ పరీక్షలు నిర్వహించుకోవాలని రిమ్స్ దంత వైద్యులు సూచించారు. గురువారం కడప నగరంలోని జయనగర్ కాలనీలో గల బాలికల పాఠశాలలో కోల్గేట్ సంభవ్ ఫౌండేషన్ ప్రతినిధులు జయకుమార్ కడప రిమ్స్ వైద్యుల ఆధ్వర్యంలో విద్యార్థినిలకు దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలామంది దంతాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారని, ఈ కారణంగా భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో దంతాలను పరిశుభ్రం చేసుకోవాలని, ఆహారం తిన్న సమయంలో దంతాలను సైతం శుభ్రపరుచుకోవాలన్నారు. క్రమం తప్పకుండా దంత పరీక్షలు నిర్వహించుకుంటూ సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యవతి, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ షరీఫ్ అబ్బాస్, జిల్లా కో ఆర్డినేటర్ రవికుమార్, కడప మండల కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలి



కడప ఎడ్యుకేషన్: అబ్దుల్‌కలాం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు



కడప కల్చరల్: కలాం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఇంటాక్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్ : నేటి బాలబాలికలు అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని జేకే ఆర్కే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు లయన్ పటాన్ ఖాదర్‌బాష పేర్కొన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతిని పురస్కరించుకుని గురువారం కడప నగరంలోని బాలుర అనాథాశ్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి చదివి మన దేశానికి ఒక మిస్సైల్‌మేన్‌గా ఎదిగాడన్నారు. రాష్ట్రపతిగా కూడా ఎన్నో సేవలందించాడన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం ఆర్గనైజర్ కరీముల్లా, అహ్మద్‌బాష, మేనేజర్ హాజీఖాన్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం

కడప కల్చరల్ : భారత రాష్ట్రపతిగా, క్షిపణి శాస్త్రవేత్తగా ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఇంటాక్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా గురువారం రాత్రి స్థానిక ఇంటాక్ కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచి కష్టాలు ఎదుర్కొని ఉన్నత స్థాయికి చేరుకున్న అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంటాక్ కో కన్వీనర్ పి.వి. సుబ్బారెడ్డి, కార్యాలయ అధ్యక్ష కార్యదర్శులు బోగాల కొండారెడ్డి, రాఘవేంద్ర వర్మ, కొండూరు జనార్ధన రాజు, భారవి, పద్మప్రియ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాల తనిఖీ

పెండ్లిమర్రి : మండలంలోని ఎగువపల్లె, ఇసుకపల్లె గ్రామాల్లో ఉన్న ఆరోగ్య ఉప కేంద్రాలను గురువారం డీఎంహెచ్‌ఓ నాగరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రాల్లోని రికార్డులు, మందులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి గ్రామాల్లో ఏమైనా అనారోగ్య సమస్యలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ రమేష్‌రెడ్డి, ఏఎంఓ వెంకటరెడ్డి, వైద్యాధికారి సమీరాభాను, సీహెచ్‌ఓ క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

నేడు పైడికాలువలో గడప గడపకు మన ప్రభుత్వం

వల్లూరు : వల్లూరు మండలంలోని పైడికాలువ గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

జూదరుల అరెస్టు

చెన్నూరు : చెన్నూరు పోలీసు స్టేషన్ పరిధిలోని పాలెంపల్లి గ్రామ సమీపంలోని ఆర్‌కే ఫంక్షన్ హాలు ఆవరణములో గురువారం సాయంత్రం పేకాట ఆడుతున్న 26 మందిని అరెస్టు చేశామని కడప రూరల్ సీఐ అశోక్ రెడ్డి, చెన్నూరు ఎస్‌ఐ బి.శ్రీనివాసులరెడ్డి పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.13,02,350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. చెన్నూరు పోలీస్ స్టేషన్ పాలెంపల్లె పరిధిలో గల ఆర్కే ఫంక్షన్ హాల్ ఆవరణలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించామని పేర్కొన్నారు.


ఆర్టీపీపీలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని ఉద్యోగులు, కార్మికులు తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఆర్టీపీపీ జేఏసీ ఆధ్వర్యంలో గేటు బయట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం వేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతు వేతన సవరణ చేసి కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. వీటితో పాటు పలు సమస్యలపై సమ్మె నోటీసును కూడా ఇచ్చామన్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకూ వివిధ రూపాలలో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు.

పాటూరులో ఘర్షణ

నందలూరు(రాజంపేట) : పాటూరు గ్రామంలో మొహర్రం సందర్భంగా ఘర్షణ చోటుచేసుకుంది. గురువారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన దళిత యువకులపై అదే గ్రామానికి చెందిన యువకులు తాగిన మత్తులో దాడి చేసినట్లు దళిత యువకులు పోలీసులకు తెలియజేశారు.

‘పొలం బడి’పై రైతులకు శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సరస్వతి

కమలాపురం : ప్రతి రైతును తన పొలానికి శాస్త్రవేత్తగా మార్చడం కోసమే ప్రభుత్వం పొలం బడి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందని మండల ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని టి.చదిపిరాళ్ల గ్రామంలో పొలం బడి పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా బ్యాలెట్ బాక్స్ పరీక్ష ఏర్పాటు చేసి రైతులకు నూతన పద్ధతులపై ఎంత మేరకు అవగాహన ఉందో తెలుసుకున్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులు అందజేశారు. ఏ పంటకు ఏ మేరకు ఎరువులు వినియోగించాలో వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పొలం బడి కార్యక్రమం ద్వారా ప్రతి రైతు తన పొలానికి శాస్త్రవేత్తను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. పంటల సాగు పాటించాల్సిన మెలకువలను, చేపట్టే సస్యరక్షణ చర్యలను, వచ్చే దిగుబడుల గురించి వివరించారు. వీపీఏలు మమత, మహేష్, వెంకట కృష్ణ, పొలంబడి రైతులు పాల్గొన్నారు.

గడువులోపు మూల్యాంకనం పూర్తిచేయాలి



డిగ్రీ మూల్యాంకన ప్రక్రియను పరిశీలిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : నిర్దేశించిన గడువులోపు డిగ్రీ మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేయాలని యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. గురువారం వైవీయూలో నిర్వహిస్తున్న డిగ్రీ సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని వీసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూల్యాంకనంలో ప్రతిభావంతులైన ఏఒక్క విద్యార్థికి నష్టం జరగకూడదన్నారు. మూల్యాంకన కేంద్రంలోని వసతులపై అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి, సహాయ పరీక్షల నిర్వహణ అధికారులు డా. ఆదినారాయణరెడ్డి, డా. సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

ఎకనామిక్స్, ఉర్దూ విభాగాలు పరిశీలన..

విశ్వవిద్యాలయంలోని హ్యూమానిటీస్ భవనంలో ఎకనామిక్స్, ఉర్దూ విభాగాలను వీసీ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరుకావాలని సూచించారు. బాగా చదువుకుంటే విశ్వవిద్యాలయం అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హ్యూమానిటీస్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సురేష్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఏర్పాటుచేస్తున్న జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని ఏపీ ఐబీసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. గురువారం జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో అల్ డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేటు కంపెనీ నిర్వహించిన జాబ్ మేళాకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. మొదట చిన్న ఉద్యోగమైనా స్థిరపడి అంచెలంచెలుగా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు వివిధ కంపెనీలను మన జిల్లాకు తీసుకు వస్తున్నారన్నారు. అర్హులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేఈఓ డోనప్ప, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



కడప డివిజన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కడప కార్పొరేషన్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు కోరారు. గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో స్థానిక కడప డివిజన్ ఆఫీసు ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు పట్టుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజలకు నిత్యం కరెంటు సరఫరా చేయడంలో కృషి చేస్తున్న విద్యుత్ ఉద్యోగుల బాగోగులను ప్రభుత్వం పట్టించుకోవాలన్నారు. పే రివిజన్‌ను వెంటనే అమలు చేయాలని, ఈపీఎఫ్‌ను జీపీఎస్‌గా మార్చాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని, సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెలో పాల్గొనడం తథ్యమన్నారు. దీనివల్ల ప్రజలకు జరిగే అసౌకర్యాలకు తాము బాధ్యత వహించమన్నారు. గ్రేడ్–2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ చేయాలని, అన్ లిమిటెడ్ మెడికల్ పాలసీని అమలు చేయాలన్నారు. చనిపోయిన గ్రేడ్–2 జేఎల్‌ఎంల కుటుంబాలకు వెంటనే ఉద్యోగాలివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ డివిజన్ కన్వీనర్ రామక్రిష్ణ, మాజీ 114 అధ్యక్షుడు రమణ, స్టేట్ కన్వీనర్ నాగమునిస్వామి, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎల్‌ఐసీ నూతన పాలసీ ‘జీవన్ కిరణ్’



డివిజనల్ మేనేజర్ గిరిధర్

కడప కల్చరల్ : జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో జీవన్ కిరణ్ పేరిట నూతన పాలసీని గురువారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. కడప నగరంలోని ఎల్ ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ గిరిధర్ స్థానిక డివిజనల్ కార్యాలయంలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి ప్రచార సామాగ్రి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పొదుపు, బీమా రక్షణ, పాలసీకాలం పూర్తయ్యాక కట్టిన ప్రీమియంలు తిరిగి చెల్లించడం, పాలసీదారుని మరణం సంభవిస్తే బీమా మొత్తం చెల్లించడం ఈ పాలసీ ప్రత్యేకతలని తెలిపారు. కనీస బీమా రూ. 15 లక్షలని ఆయన తెలిపారు. ఆదాయాన్ని బట్టి గరిష్ఠ బీమాపై పరిమితి లేదన్నారు. ప్రమాద బీమా, వైకల్య ప్రయోజనాలు ఈ పాలసీలో అందుబాటులో ఉన్నాయని, మెచ్యూరిటీ లేదా మరణం తర్వాత వచ్చే మొత్తాలను ఒకేసారి కాకుండా ఐదేళ్లపాటు తీసుకోవచ్చని వివరించారు. మార్కెటింగ్ మేనేజర్ శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ 18 సంవత్సరాల వయస్సు నుంచి 60 సంవత్సరాల వయస్సు వారు ఈ పాలసీ తీసుకోవచ్చని, నిబంధనల మేరకు పాలసీ కాలాన్ని 10–40 సంవత్సరాల వరకు ఎంచుకోవచ్చన్నారు. బీమా రూ. 50 లక్షల పైన లేదా సింగిల్ ప్రీమియం పాలసీలపై కొన్ని రాయితీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ శ్రీనివాస్, ఏఓ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో రెట్టింపు ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే విస్తరణ శాస్త్రవేత్త మహేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్ : సమీకృత వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులకు ఆదాయం రెట్టింపు అవుతుందని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. గురవారం కడప నగర శివార్లలోని కేవీకేలో ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ప్రత్యక్ష వీక్షణ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 14వ విడత రైతుల ఖాతాలో 2 వేలు రూపాయలు జమచేయడమే కాకుండా 1,25,000 ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలు, సల్ఫర్ పూతతో కూడిన యూరియా, 16 వందల రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్లాట్ పాం ప్రారంభోత్సవాల ప్రత్యక్ష వీక్షణ ప్రసార కార్యక్రమాన్ని రైతులు వీక్షించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ కార్యక్రమాన్ని రాజస్థాన్ రాష్ట్రంలోని సికార్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా కేవీకేలో రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విస్తరణ శాస్త్రవేత్త మహేష్‌బాబు సమీకృత వ్యవసాయ పద్ధతల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ మురళీకృష్ణ, ఆత్మ పథక సంచాలకులు విజయలక్ష్మి, ఆత్మ పథక ఉప సంచాలకులు పద్మలత, కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, సాయి మహేశ్వరి, మానస, రైతులు పాల్గొన్నారు.

రెగ్యులర్ డీబీసీ డబ్ల్యుఓలను నియమించాలి

కడప సెవెన్‌రోడ్స్ : వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖకు రెగ్యులర్ జిల్లా అధికారిని నియమించాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శంకర్, జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు గురువారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు విన్నవించారు. మూడేళ్లుగా రెగ్యులర్ అధికారి లేకపోవడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. హాస్టళ్లలో పలు సమస్యలు ఉత్పన్నమై విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా ఉన్న బ్రహ్మయ్యకు మైనార్టీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్ అదనంగా ఉండడం వల్ల ఆయనకు పనిభారం పెరిగిందని, దీంతో హాస్టళ్లను పర్యవేక్షించ లేకపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రెగ్యులర్ అధికారిని నియమించాలని కోరారు. ఆర్‌ఎస్‌వైఎఫ్ నగర నాయకులు సమద్, షాబాద్ కార్యక్రమంలో పాల్గొన్నారు.